ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.6, కనిష్ఠం 30.5



కామారెడ్డి
జిల్లా వార్తలు
5
గురువారం 25 ఏప్రిల్ 2024

బిచ్కుంద డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

బిచ్కుంద, ఏప్రిల్ 24: బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 9,10 తేదీల్లో 'జాతీయ విద్యావిధానం' అనే అంశంపైన రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రముఖర్జీ తెలిపారు. బుధవారం అందుకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల ప్రముఖులు, విద్యావేత్తలు వక్తలుగా వస్తున్నారని తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ కోసం 97011 55512 నెంబర్‌కు సంప్రదించాలని హన్మండ్లు తెలిపారు.





కామారెడ్డిలో ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



పోచారం ప్రాజెక్ట్‌లో తగ్గిపోతున్న నీరు

నీటి ఎద్దడి

- రోజురోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలు
- జిల్లాలో 16 మీటర్ల లోతులో నీటి మట్టాలు
- డెడ్ స్టోరేజీకి చేరిన పోచారం ప్రాజెక్ట్
- కామారెడ్డి పట్టణంతో పాటు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్న వైనం
- దీర్ఘకాలికంగా సమస్య ఉన్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 24: జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగు నీటితో పాటు సాగునీటి ఎద్దడి ఏర్పడుతోంది. ప్రధానంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో తాగునీటికి సమస్య నెలకొంటుంది. గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, మద్నూర్, జుక్కల్, దోమకొండ తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తండాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని, బావులలో ఉన్న నీరు అడుగంటుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. బోర్లు, చెరువుల ద్వారా నీటి సరఫరా అయ్యే ప్రాంతాల్లో సూర్యతాపానికి అడుగంటే పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటికీ పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ లేకపోవడంతో తాగునీటి సమస్య ఎదురవుతుందని ప్రజలు చెబుతున్నారు. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్న ప్రజల అవసరాలకు తగిన విధంగా సరిపోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పడిపోతున్న భూగర్భ జలాలు

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో మోటార్ బోర్లు ఎత్తిపోతుండగా నీటి బావులు ఎండిపోతున్నాయి. జిల్లాలో మారుమూల గ్రామాలు తండాల్లో తాగునీటి సమస్య ఎదురవుతోంది. రోజు రోజుకూ ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోనూ నీరు తగ్గుముఖం పడుతోంది. దీంతో కామారెడ్డి పట్టణ ప్రాంతంతో పాటు పలు మండలాల్లోనూ నివాస ప్రాంతాల్లో మోటార్ బోర్లు వట్టిపోతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో భూగర్భ జలాలు దాదాపు 16 మీటర్ల లోతులోకి పడిపోయాయి. ఇక తాగునీటి సమస్య ఇలా ఉంటే ఆయా చోట్ల పంట పొలాలకు సాగునీటి సమస్య సైతం ఎదురవుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోనూ నీటి నిల్వలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. ఇక నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లో ఆయా గ్రామాలకు సాగునీరు అందించే పోచారం ప్రాజెక్ట్ డెడ్ స్టోరేజీకి చేరింది. వచ్చే వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే కానీ ప్రాజెక్ట్ నిండే పరిస్థితి కనపడడం లేదు. వర్షాలు తక్కువగా కురిస్తే ఎల్లారెడ్డి డివిజన్‌లోని ఆయా మండలాలకు వానాకాలం పంటలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు.

కామారెడ్డిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

కామారెడ్డి మున్సిపాలిటీలో నీటి ఎద్దడితో గత నెల రోజుల క్రితం నుంచే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగాపూర్, అశోక్ నగర్‌కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ, రామేశ్వర్‌పల్లి, దేవునిపల్లితో పాటు పలు ప్రాంతాల్లో నిత్యం ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరు అందేలా మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. మిగిలిన కాలనీల్లో సైతం బోర్లలో నీరు తగ్గిపోవడంతో నీరు రాక ప్రజలు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కామారెడ్డి పాత పట్టణానికి పెద్ద చెరువుతో పాటు బుర్రమత్తడి నుంచి నీటి సరఫరాను చేస్తున్నారు. కొత్త పట్టణానికి మాత్రం బోర్ల ద్వారా, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ద్వారా వచ్చే గోదావరి నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి ఈ ప్రాజెక్ట్ ద్వారా కామారెడ్డి మున్సిపాలిటీకి 10 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉండగా సాధారణ సమయంలో కేవలం 4 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరఫరా అవుతుందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ నీరు కూడా అంతంత మాత్రంగానే సరఫరా అవుతుండడంతో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. పాత పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు అంతంత మాత్రంగానే ఉంటున్నప్పటికీ విలీన గ్రామాలతో పాటు కొత్త పట్టణంలోని కాకతీయనగర్, అశోక్ నగర్, ఎన్‌జీవోస్ కాలనీ లాంటి ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. ప్రజలకు నీటిని సరఫరా చేసేందుకు మున్సి పల్ సిబ్బంది సిద్ధంగా ఉన్న రెండు నుంచి నాలుగు ట్యాంకర్లు మాత్రమే అందుబాటులో ఉండడంతో నీటి సరఫరాలో కొంత జాప్యం ఏర్పడుతుందని తెలుస్తోంది. మరిన్ని ట్యాంకర్లను ఏర్పాటు చేస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు కొద్దిగానైన తప్పనున్నాయి.

నీటి సమస్యపై ప్రజాప్రతినిధుల దృష్టి కరువు

ప్రతీ సంవత్సరం ఎండాకాలం వచ్చిందంటే చాలు ప్రజలు నీటి కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఆయా మండలాలు, గ్రామాలతో పాటు జిల్లా కేంద్రంలో ఈ సమస్య ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్నా ప్రజాప్రతినిధులు మాత్రం శాశ్వత పరిష్కారానికి మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎండాకాలం రాగానే ప్రజలకు నీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అధికారుల మీద ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెస్తున్నారే తప్ప మిగిలిన 8 నెలల కాలంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయా వార్డుల్లో వేసిన రోడ్ల మీద మళ్లీ రోడ్లు వేయడం, మురికి కాలువలు కట్టిన సంవత్సరం లోపే మళ్లీ కూలదోసి కట్టేలా చూడడం కాంట్రాక్టర్ ఇచ్చే కమీషన్ల కోసం మాత్రమే కక్కుర్తి పడుతుంటారే తప్ప తమను ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ఎండా కాలం వస్తే చాలు
ప్రతీ సంవత్సరం నీటి సమస్యలు ఎదురవుతున్నాయని వాటికి శాశ్వత పరిష్కారం చూపు దామని ఆలోచన మాత్రం చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. కామారెడ్డి మున్సిపాలిటీతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు, ఆయా గ్రామ పంచాయతీల్లో ఇదే తంతూ కొనసాగుతుండడం గమనార్హం. కేవలం ఎండాకాలం వచ్చిన సమయంలోనే ప్రజల దాహార్తిపై దృష్టి సారించడం అధికారులపై ఒత్తిడి తీసుకుని వచ్చి తమపై తప్పు ఉండకుండా కార్యాలయాల వద్ద ప్రజలతో నిరసన కార్యక్రమాలు చేపట్టడం పరపాటిగా మారింది. ఉదాహరణకు కామారెడ్డి మున్సిపాలిటీలో 10 ఎంఎల్‌డీ నీటి సరఫరా ఉండాల్సి ఉండగా కేవలం 4 ఎంఎల్‌డీ నీరు మాత్రమే సరఫరా అవుతుంది. ఈ పరిస్థితి గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతునే ఉంది. అయిన ప్రజాప్రతినిధులు ఏనాడు దానిపై దృష్టి సారిం చిన దాఖలాలు లేవు.

చెరువులు, బోర్లలో తగ్గుముఖం పడుతున్న నీరు

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగాయి. గత నెలరోజు నుంచి జిల్లాలో 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్లలోని ఆయా మండలాల్లో భూగర్భ జలాలు తీవ్ర స్థాయిలో అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు పడిపోతుండడంతో మోటార్ బోర్లు ఎత్తిపోతున్నాయి. రెండు ఇంచులు పోసే మోటార్ బోరు ప్రస్తుతం ఆఫ్ ఇంచ్‌లో పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల నీటి బావులు, చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి.

ఇంటర్ ఫలితాల్లో.. జిల్లాకు చిట్టచివరి స్థానం!

- దారుణంగా పడిపోయిన ఫలితాల రేటు
- ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 50 శాతం దాటని ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 34.81 శాతం, సెకండియర్‌లో 44.29 శాతంతో విద్యార్థుల ఉత్తీర్ణత
- ఉత్తీర్ణత సాధించిన 7,198 మంది విద్యార్థులు
- రాష్ట్రంలో మొదటి, రెండో సంవత్సరంలో జిల్లాకు 35వ స్థానం



ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన చందన





ఎంపీసీ మొదటి సంవత్సరంలో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించిన భవాని, రచన



.. ఫోర్త్ ర్యాంక్ సాధించిన అమూల్య

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఎప్పుడు లేనంతంగా ఈ సంవత్సరం ఇంటర్ ఫలితాల రేటు దారుణంగా పడిపోయింది. పలు కళాశాలల్లో 4 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో 50 శాతం ఉత్తీర్ణత నమోదు కాకపోవడం గమనార్హం. మొదటి, రెండో సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో జిల్లా 35వ స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఇక జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్ట్, సెకండియర్ జనరల్, ఒకేషన్‌లలో 17,441 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 7,198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 7,658 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2,666 మంది పాస్ కాగా 34.81 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 7,234 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,204 మంది పాస్ కాగా 44.29 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 44.29 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో ఎప్పుడూ లేనంతగా ర్యాంక్ దారుణంగా పడిపోయింది. జిల్లా 44.29 శాతం ఉత్తీర్ణతతో 35వ స్థానంలో నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 7,234 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 3,204 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 3,531 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇందులో 1,207 మంది విద్యార్థులు పాస్ కాగా 34.21 శాతంతో ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 3,703 మంది పరీక్షలకు హాజరు కాగా 1996 మంది పాస్‌కాగా 53.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించినట్లు తెలుస్తోంది. ఒకేషనల్‌లో ద్వితీయ సంవత్సర విద్యార్థులు 1047 మంది పరీక్షలు రాయగా 620 మంది విద్యార్థులు పాసవ్వగా 60.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 459 మంది పరీక్షలు రాయగా 175 మంది విద్యార్థులు పాస్ కాగా 38.13 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 568 విద్యార్థులు పరీక్ష రాయగా 445 మంది విద్యార్థినులు పాస్ కాగా 78.35 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మొదటి సంవత్సరంలో 34.81 శాతం ఉత్తీర్ణత

కామారెడ్డి జిల్లా చిట్టచివరగా 35వ స్థానంలో 34.81 శాతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత సంవత్సరం 28వ స్థానంలో ఉండగా ఈ సంవత్సరం ఏకంగా 35వ స్థానంలోకి దిగజారింది. మొదటి సంవత్సరంలో మొత్తం 7,658 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 2,666 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 3,785 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఇందులో 955 మంది పాస్ కాగా 25.23 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 3,873 మంది పరీక్షలు రాయగా ఇందులో 1,711 మంది పాస్ కాగా 44.18 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో బాలికలదే ఉత్తీర్ణత శాతం ఎక్కువగా నమోదయింది. ఇక ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి మొదటి సంవత్సర విద్యార్థులు 1,502 మంది పరీక్షలు రాయగా 627 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 711 మంది పరీక్షలు రాయగా 207 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 791 విద్యార్థులు పరీక్ష రాయగా 494 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలు కళాశాలల విద్యార్థులు

ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితా ల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ కళాశాలల విభాగంలో బీర్కూర్, కామా రెడ్డి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. సాందీపని కళా శాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470కి గాను రచన, భవాని, అమూల్యలు 467 మార్కులు రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. జైపాల్, నేహ 466, జశ్వంత్, శివకార్తిక్, ఉమర్, తేజశ్రీ, యశ్వంత్, రామకృష్ణ, మధులిని 465 మార్కులు, బైపీసీ విభాగంలో మహ్మబిలాల్, ఫాతిమా 440కిగాను 435 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 1000కి గాను పి.చందన 991, సుప్రీతగౌడ్ 985, నందు 984, వైష్ణవి 984, శ్రావ్య 984, రక్షిత 983, బైపీసీ విభాగంలో అఖిల 990, లావణ్య 978, రవళిక 977, సీఈసీ విభాగంలో షేరిన్‌బేగం 969, అజయ్ 959, ఎంఈసీలో బోరాడిశజైన్ 955 మార్కులు సాధించారు. ఎస్ఆర్‌కే కళాశా లకు చెందిన నందిని ఎంపీసీ విభాగంలో 470కి 466, పూజిత బైపీసీ విభాగంలో 440కి 432, ఎస్.నందిని ద్వితీయ సంవత్సరంలో 1000కి గాను 979 మార్కులు సాధించింది.

కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్



కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ




అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

- మంత్రి రాజనర్సింహ ఆధ్వర్యంలో కండువా కప్పుకున్న ఎల్లారెడ్డి చైర్మన్ సత్యనారాయణ
- చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపల్ బీఆర్ఎస్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంగారెడ్డిలో నామినేషన్ దాఖలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజ నర్సింహ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి చైర్మన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే చైర్మన్ కాంగ్రెస్‌లో చేరడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్‌లోని మిగతా 10 మంది కౌన్సిలర్‌లు అవిశ్వాసం పెట్టారు. వెంటనే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కౌన్సిలర్‌లు చేరుకుని కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అవిశ్వాస పత్రాన్ని అందించారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో రాజకీయాలు వేగంగా మారనున్నాయి. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో మొత్తం 12 మంది కౌన్సిలర్‌లు ఉండగా ఇందులో ఒక కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. చైర్మన్ సత్యనారాయణ ఒకరు కాంగ్రెస్‌లో చేరారు. మిగితా 10 మంది కౌన్సిలర్‌లు ఆయనకు వ్యతిరేకంగా అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం చైర్మన్ నెగ్గుతారా లేదా చూడాలి. అయితే మిగతా కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చర్చలు జరుపుతున్నారని ప్రచారం సాగుతోంది.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపాలిటీలోని 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇమ్రాన్ మోహియుద్దీన్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిలో భాగంగా ఇతర పార్టీ నాయకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్‌లు అన్వర్, శివకృష్ణమూర్తి, వంశీ, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

నేటి నుంచి ఓటరు స్లిప్‌ల పంపిణీ

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 24: జిల్లాలోని ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు గురువారం నుంచి మే 8 వరకు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బుధవారం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఓటు వేసేందుకు ఓటర్లు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధి హామీ కార్డు వంటి వాటిలో ఒక దానిని తప్పనిసరిగా తీసుకు వెళ్లాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వివరాలు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, సభలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ముందస్తుగా అనుమతులు పొందాలని తెలిపారు. అనుమతులు లేకుండా ర్యాలీలు,సభలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనవరి 23 నుంచి ఏప్రిల్ 15 వరకు మూడు నియోజకవర్గాల్లో 6007 మంది కొత్త ఓటర్లు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్

11 నామినేషన్ల దాఖలు

- ఇప్పటి వరకు 29 నామినేషన్లు

కామారెడ్డి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బుధవారం మొత్తం 11 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూర్ తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ 1, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ రెండు సెట్లు, బీఎస్పీ తరఫున బట్టింకి బాలరాజు 1, ధర్మసమాజ్ పార్టీ తరపున దేవాసికామని 1, రాష్ట్రీయ సమన్య ప్రజాపార్టీ తరపున మహ్మద్ మున్వర్ హుస్సేన్ 1, స్వతంత్ర అభ్యర్థులు తలారీ అశోక్, జైపాల్ నాయక్, రమేష్ సజ్జపూర్, యాకుబ్ షరీఫ్, గొల్లపల్లి మన్నెయ్యలు ఒక్కోసెట్ నామినేషన్‌లు దాఖలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ మంత్రి రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఇప్పటి వరకు 29 నామినేషన్‌లు 34 సెట్లు అభ్యర్థులు దాఖలు చేశారు.

వేంపల్లిలో ఘనంగా మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన

● పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, ముత్యాల సునీల్‌కుమార్

ముప్కాల్, ఏప్రిల్ 24: ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ప్రతిష్ఠాపన మహోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొనగా.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఆలయంలో ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపనకు అర్చకులు వేదమంత్రాలతో నవగ్రహ పూజ, కలశపూజ, యజ్ఞం, పుణ్యాహవచనం వంటి పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన గావించగా మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదు : భూమన్న

సిరికొండ, ఏప్రిల్ 24: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ప్రకటించిన మాదిగ నాయకుడు మందకృష్ణ మాదిగ మాదిగల అభివృద్ధికి ఏనాడూ సహకరించలేదని మాదిగ కుల సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో భూమన్న మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం పని చేసిన ఎమ్మార్పీఎస్ నాయకుల అభివృద్ధికి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా ఏనాడూ సహకరించి ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముప్పై ఏళ్ల ఉద్యమంలో మాదిగ జాతీ కోసం పని చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు అన్ని రాజకీయ పార్టీల నుంచి ఎంపీ టికెట్లను ఇప్పించడానికి మంద కృష్ణ మాదిగ ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. అలాగే ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి పోరాటాల వల్లనే మందకృష్ణ మాదిగ దేశస్థాయి ఉద్యమ నేతగా ఎదిగారని ఆయన గుర్తు చేశారు. మాదిగ జాతి కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను ఆర్థికంగా ఆదుకోలేక పోయారని, రాజకీయంగా ఎదగడానికి కూడా సహకరించని మందకృష్ణ మాదిగా.. ఉద్యమాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని భూమన్న ఆరోపించారు. బీజేపీలో మాదిగ ఉద్యమ నేతలకు ఎవరికీ ఎందుకు టికెట్లు ఇప్పించలేదో? స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేయాలంటే ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావచ్చని, లేదంటే సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున రిజర్వేషన్లకు అనుకూలంగా విధించకుండా కమిటీని ఎందుకు వేసిందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో అత్యధికంగా మాదిగ ఓటర్లున్న నాగర్‌కర్నూల్‌లో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పనిచేసే నాయకుడికి బీజేపీ నుంచి టికెట్ ఇప్పిచండంలో మంద కృష్ణమాదిగ ఎందుకు చొరవ చూపించలేదన్నారు. అంతేకాకుండా మహాజన సోషలిస్టు పార్టీ పెట్టి.. దీని మాదిగ నాయకులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చి ఎందుకు పోటీ చేయించలేదని ఆయన ప్రశ్నించారు. వర్గీకరణ చేయకుండా కమీటీ పేరుతో కాలయాపన చేసే బీజేపీని మాదిగలెవరు నమ్మరని, బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి ఇచ్చిన రాజ్యంగాన్ని మార్చడానికి ప్రయత్నిస్తున్న ఆ పార్టీకి రానున్న ఎన్నికల్లో మాదిగలు వ్యతిరేకంగా ఓటు వేసి ఓడించడం ఖాయమని, మందకృష్ణ మాదిగ మాటలు నమ్మవద్దని స్పష్టం అన్నారు.



సుంకెట్‌లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధిచెప్పాలి

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, ఏప్రిల్ 24: హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సావెల్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని హామీఇచ్చారని, ఇప్పటికీ మహిళలకు ఉచితబస్సు ప్రయాణం తప్ప ఏ ఒక్కహామీనీ నెరవేర్చలేదని అన్నారు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు 15న రుణమాఫీ చేస్తారని దేవుళ్ల మీద ఒట్టు పెట్టడం కొత్త నటకానికి తెరలేపారని అన్నారు. రాముడు పేరుతో, పసుపుబోర్డు పేరుతో రైతులను మోసం చేసిన వ్యక్తి నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులకు బుద్ధి చెప్పి ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, మచ్చర్ల రాజారెడ్డి, కమలాకర్, మోహన్, సాయిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుంకెట్, దొన్‌పాల్‌లో..

మోర్తాడ్: మండలంలోని సుంకెట్, దొన్‌పాల్ గ్రామాల్లో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం హోటల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీ తాగుతూ ముచ్చటించారు. అనంతరం దొన్‌పాల్‌లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏలియా, బీఆర్ఎస్ నాయకులు తీగెల ప్రదీప్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, ఏప్రిల్24: బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో 19వ అఖండ శివనామ సప్తాహ బుధవారంతో 4వ రోజుకు చేరింది. ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మండపంలో శివ పారాయణం, వీరశైవ పవిత్ర గ్రంథం, పరమ రహస్య పారాయణ పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ 108 బస్వలింగ శివాచార్య స్వామిజీ కౌలాస్ పీఠాధిపతులు శివనామ సప్తాహ గురించి భక్తులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు. మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని, దేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు ఆచరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజ్ ప్రతినిధులు పురాణే అజయ్ కుమార్, శంకరప్ప, యాదవ రావు పటేల్, విఠలప్ప, ప్రభు అప్ప, శివ, దిలీప్ కుమార్, రాజు, శివకుమార్, గణపతిఅప్ప, తదితరులున్నారు.

మే డేను జయప్రదం చేయాలి



మే డే వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటగిరి, ఏప్రిల్ 24: కార్మికుల హక్కుల కోసం మే డేను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ కోరారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం 138వ మేడే దినోత్సవాలను పురస్కరించుకుని వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి కార్మికులను రోడ్డున పడేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గంగాధర్, భరత్, రాజు, గంగారాం, హన్మాండ్లు, సాయిలు, వసీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్24: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ నందవార్ జితేంద్ర రామచంద్ర అన్నారు. బుధవారం బోధన్ పట్టణ శివారులోని మినార్‌పల్లి చౌరస్తా వద్ద శ్రీకాకతీయ చేయూత చారిట్రబుల్ ట్రస్టులో ఉన్న విద్యార్థులచే కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాలలో రాణించాలని, చదువు యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. నేటి తరం విద్యార్థులు రాబోయే తరంకు ఆదర్శం కావాలన్నారు. కాకతీయ చారిటబుల్ ట్రస్టు సేవలను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్‌లు రమేష్‌కుమార్ రాయ్, రవీంద్ర రోషన్, రాంభూషణ్ మిశ్రా, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి'



బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీఎమ్మెల్సీ వీజీ.గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో తొర్లికొండ, బ్రహ్మణ్‌పల్లి గ్రామాల బీఆర్ఎస్ బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీజీ గౌడ్ సమక్షం బ్రహ్మణ్‌పల్లి, తొర్లికొండ గ్రామాల యువకులు బీఆర్ఎస్‌లో చేరగా బీఆర్ఎస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో వీజీ.గౌడ్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వం పనితీరు అమలుచేయని హామీలపై ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలేదని ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం కష్టపడి సైనికుల్లా పని చేయాలన్నారు. కారుగుర్తుకు ఓట్లు వేసి బీఆర్ఎస్ ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, ధర్పల్లి, జక్రాన్‌పల్లి జడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, తనుజా శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు పద్మరాజు, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ అన్వేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిపించాలి

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం మాజీఎమ్మెల్యే జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్లెం మోహన్, మాజీ సొసైటీ చైర్మన్ నలిమెల మోహన్‌రెడ్డి, మోతె చిన్నారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా అసోసియేషన్‌లో రాజకీయ జోక్యం!

» జిల్లాలో రెండుగా చీలుతున్న అసోసియేషన్ » అసోసియేషన్ చీలికతో క్రీడాకారులకు నష్టం » జిల్లాలో అసోసియేషన్‌లకు మండల కమిటీలు నిల్



క్రీడా అసోసియేషన్‌లకు మండల కమిటీలు నిల్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 24: జిల్లాలో క్రీడా అసోసియేషన్‌లో రాజకీయ జోక్యం ఎక్కువవుతోంది. క్రీడా అసోసియేషన్‌లు క్రీడల అభివృద్ధి కోసం కాకుండా రాజకీయాలలో పలుకుబడి కోసం అసోసియేషన్‌లో పదవులు దక్కించుకుంటున్నారు. జిల్లాలోని ప్రధాన అసోసియేషన్‌లన్నీ రాజకీయ నాయకులతో నిండిపోయాయి. ప్రధాన అసోసియేషన్‌లకు రాజకీయ నాయకులు అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాజకీయ నాయకులు ధన రూపకంగా అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతారని అసోసియేషన్‌లో ప్రాధాన్యం ఇస్తే క్రీడాకారులకు న్యాయం మాత్రం జరగడం లేదు. గత కొన్ని ఏళ్లుగా కొన్ని క్రీడా అసోసియేషన్‌లు క్రీడల అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. పేరుకు మాత్రం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులమంటూ చెప్పుకుంటూ డాబుకు పోతున్నారు. కానీ క్రీడల అభివృద్ధికి మాత్రం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదు. జిల్లాలో దాదాపుగా ఎక్కువ అసోసియేషన్‌లకు జిల్లాలో పేరొందిన రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు అధ్యక్షులుగా ఉన్నారు. క్రీడలను నిర్వహించడం భారంగా మారడంతో డబ్బులు ఉన్న రాజకీయ నాయకులను, ఉద్యోగ సంఘ నేతలను అధ్యక్షులుగా పెట్టుకున్నారు. గత కొన్ని రోజులు క్రీడాభివృద్ధికి సహకరించడం లేదని పలువురు క్రీడాసంఘాల నేతలు వాపోతున్నారు. క్రీడల అభివృద్ధికి పాటుపడతారని తెచ్చిపెట్టుకున్న వారికి సహాయం మాత్రం అందడం లేదు. మరి కొందరు క్రీడల అసోసియేషన్‌లో రాజకీయ నాయకులకు ఏం పని అని బహిరంగానే విమర్శిస్తున్నారు. క్రీడా సంఘాల్లో రాజకీయ నాయకుల జోక్యం తగదని క్రీడా సంఘాలు క్రీడాకారులతోనే ఉండాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

● రెండుగా చీలుతున్న అసోసియేషన్

జిల్లాలో క్రీడా అసోసియేషన్ రెండుగా చీలిపోయాయి. రాష్ట్ర నాయకత్వం రెండుగా చీలడంతో జిల్లాలో సైతం రెండు అసోసియేషన్‌లు ఏర్పడ్డాయి. దీంతో క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. జిల్లాలో హ్యాండ్‌బాల్‌తో పాటు కొన్ని అసోసియేషన్‌లు జిల్లాలో రెండుగా చీలడంతో క్రీడాకారులు ఏ అసోసియేషన్ వైపు ప్రాతినిధ్యం వహించాలో అర్థం కావడం లేదు. కొన్నిసార్లు ఒక అసోసియేషన్ తరఫున జిల్లాస్థాయిలో ఆడిన రాష్ట్రస్థాయిలో ఆ అసోసియేషన్‌కు గుర్తింపు లేకపోవడంతో క్రీడాకారులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా జిల్లాలోని కొన్ని అసోసియేషన్‌లు రెండుగా చీలిన అనంతరం వేరువేరుగా ఎంపికలు నిర్వహించడంతో క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర నాయకుల లొల్లితో జిల్లాలో రెండు అసోసియేషన్‌లుగా చీలాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికే కొన్ని అసోసియేషన్‌లో రెండుగా చీలి కోర్టు మెట్లు ఎక్కాయి. రాష్ట్ర అసోసియేషన్‌లో ఏం జరుగుతున్నా జిల్లాలో మాత్రం క్రీడాకారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో కొన్ని క్రీడా అసోసియేషన్‌లకు మండల కమిటీలు లేవు. నేరుగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని అసోసియేషన్‌లను నడుపుతున్నారు. మండల కమిటీ ద్వారా జిల్లా కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా నేరుగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకొని అసోసియేషన్ అని నడుపుతున్నారు. జిల్లాలో సుమారు 29 మండలాలు ఉండగా, కొన్నింటికి మాత్రం మండల కమిటీలు ఉన్నాయి. క్రీడా సంఘాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా సంవత్సరాల తరబడి ఉన్న నాయకులే ఆధిపత్యం కొనసాగిస్తున్నారు. కొందరు సీనియర్ క్రీడాకారులు ఉన్న వారికి క్రీడా అసోసియేషన్‌లో స్థానం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా అసోసియేషన్‌లు కురువృద్ధులతో నిండిపోయాయి. కనీసం కొత్తవారికి అవకాశం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అసోసియేషన్‌లు కొత్తవారికి అవకాశం ఇవ్వాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

● అత్యుత్తమ మార్కులతో మెరిసిన విద్యార్థులు ● విద్యార్థులను అభినందించిన అధ్యాపకులు, గ్రామస్థులు

భీమ్‌గల్‌రూరల్, ఏప్రిల్24: ఇంటర్ ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు, గురుకుల, ఆదర్శ, మోడల్ కళాశాలల్లో విద్యార్థులు సత్తాచాటారు. భీమ్‌గల్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఇంటర్ సెకండ్‌ఇయర్ ఎంపీసీ విద్యార్థిని తుమ్మ సుప్రిక 955, కావ్య 938, బైపీసీ విభాగంలో శ్రీపాద వైష్ణవి 935, సారా మహీన్ 926, జాహనాజ్ 911 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్‌చిరంజీవి తెలిపారు.

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ధర్మారం గురుకుల విద్యార్థుల

డిచ్‌పల్లి: ధర్మారం(బీ) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటిసంవత్సరం ఎంపీసీలో మేఘన, లక్కీ ఇద్దరు విద్యార్థినులు 470 మార్కులకు 468 మార్కులు సాధించి రికార్డు సృష్టించారని ఆమె తెలిపారు. రిషిక (467), అశృత(466), మార్కులు సాధించారు. బైపీసీలో వైష్ణవి 440మార్కులకు 438 సాధించగా, జోయ్‌సీ,కీర్తన, నైనిక436 మార్కులు పొందగా, రెండో సంవత్సర ఇంటర్మీడియేట్‌ఫలితాల్లో బైపీసీలో స్రవంతి 987 మార్కులు సాధించగా, దేవి 985 సాధించిందన్నారు. ఎంపీసీ విభాగంలో వర్షజయశ్రీ అభినయ 979 సాధించగా సంధ్య అస్మిత 977తో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి

ముప్కాల్: బాల్కొండ మండలంలోని ఇంటర్మీడియేట్ ఫలితాలలో బాలికలదే పైచేయి నిలిచింది. బాల్కొండ తెలంగాణ రెసిడెన్షియల్ మైనారిటీకళాశాలలో ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో వై.నిత్ 966, జి.మైథిలి 926, ఎంపీసీలో బి.సంజన 957, ఎ.నవనీత 954 మార్కులు సాధించగా మొదటి సంవత్సరంలో బైపీసీలో 435, అభిశృతి 434, ఎంపీసీలో స్నేహజ 431, హరిణి 430 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్‌లో 93 శాతం, మొదటి సంవత్సరంలో 85శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు.

బాల్కొండ ఆదర్శ కళాశాలలో..

బాల్కొండ ఆదర్శ కళాశాలలో సాధించిన ఫలితాల్లో మొదటిసంవత్సరంలో ఎంపీసీలో శ్రీవర్ష 450, జె.వైష్ణవి 447, బైపీసీలో ఎస్ అనిల్ 393, శ్రావణి 384, సెకండ్ ఇయర్ ఎంపీసీలో బి.అభిజ్ఞ 952, కె.వెన్నెల 936, బైపీసీలో జి.వెన్ను 902, సీఈసీలో జి.సాయి హర్షిణి 904, పి.శరణ్య 828, ఎంఈసీలో జె.చందన 721మార్కులు సాధించారు.

నవీపేట: నవీపేట మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 33 శాతం విద్యార్థినులు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో శ్రీలక్ష్మి (866/1000) మార్కులు సాధించగా బైపీసీ విభాగంలో సానియా మిర్జా (901/1000)మార్కులు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 30శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ విభాగంలో పీ.భూసారిక(460/470) మార్కులు సాధించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మోకన్‌పల్లి కేజీబీవీలో..

మండలంలోని మోకన్‌పల్లి కేజీబీవీలోని ఎంహెచ్‌డబ్ల్యూ మొదటిసంవత్సరంలో వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రత్యేకాధికారిణి రాణి తెలిపారు.

సత్తా చాటిన ధర్పల్లి విద్యార్థులు

ధర్పల్లి: ఇంటర్ ఫలితాల్లో ధర్పల్లి విద్యార్థులు సత్తాచాటారు. మండలకేంద్రానికి చెందిన వార్షికరెడ్డి ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467/470 మార్కులు సాధించింది. మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాలకు చెందిన రాజశ్రీ ద్వితీయ సంవత్సరంలో 980/1000 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం బైపీసీలో అదే పాఠశాలకు చెందిన సంజన బైపీసీలో 435/445 మార్కులు సాధించింది. ఎంపీసీలో ఆర్తి మొదటి సంవత్సరంలో 460/470 మార్కులు సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించడంపై ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్‌సాహెబ్ అభినందించారు.

పెర్కిట్: మోడల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంపీసీలో 470మార్కులకు ఆర్.చందన 460, ఎం.వైష్ణవి 453, లేఖశ్రీ 450, డి.వైష్ణవి 447, కావ్య 446, మాదవ్ 446, శ్రీవర్ధన్ 436, బైపీసీలో జి.సాహితి 413, సీఈసీలో ఎం.సౌమ్య 468మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో ప్రజ్ఞశ్రీ 977, బైపీసీలో కె.యజ్ఞశ్రీ 973, సీఈసీలో జి.జ్ఞనేశవరి 928, ఎంఈసీలో ఎ.శృతి 795 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీన్ అభినందించారు.

సిరికొండ: ఇంటర్ ఫలితాల్లో మోడల్ స్కూల్లో మొదటి సంవత్సరం ఫలితాల్లో 94 శాతంమంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 93శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సత్తాచాటిన ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల విద్యార్థులు

ఇందల్వాయి: ఇంటర్ ఫలితాల్లో ఇందల్వాయి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీలత తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 73 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో డి.మౌనిక 459 మార్కులు, రెండవ సంవత్సరంలో బి.పద్మ, బి.అనూష అత్యధికంగా 962 మార్కులు సాధించారని, బైపీసీలో అత్యధిక ఆర్.పవిత్ర 952 మార్కులు సాధించినట్లు తెలిపారు.

కోటగిరిలో..

కోటగిరి: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనారిటీ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కబనర్చారు. మైనారిటీ కళాశాలలో 50మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. షేక్.సుబాన్ బైపీసీలో (956/1000) మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడు. హరిన్ కుమార్ (949/1000) మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. వివేక్ రెడ్డి ఎంపీసీ విభాగంలో (940/1000) మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 195మంది విద్యార్థులకుగాను 87మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కళాశాల టాపర్‌గా ఎన్.కీర్తి బైపీసీలో (927/1000), హంజెఫా హుస్సేన్ (914/1000)మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కొత్తపల్లికి చెందిన సావిత్రి 420 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది.

ఇంటర్ ఫలితల్లో జక్రాన్‌పల్లి ఆదర్శ కళాశాల విద్యార్థుల ప్రతిభ

జక్రాన్‌పల్లి: ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో జక్రాన్‌పల్లి ఆదర్శ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో అక్షయ 449, నేహ 447, వైష్ణవి 445, గంగోత్రి 440, రాఘవీ 437మారుకలు సాధించారు. బైపీసీలో అను 434, రోషిత, తేజస్విని 417, సాయి లక్ష్మీ 398, సీఈసీలో బి.పల్లవి 392, వెన్నెల 375, మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో భానుమతి 938, మనోజ్ఞ 934, బైపీసీలో ఇంద్రజ 893, వెన్నెల 890, సీఈసీలో శ్రావణి 923, సంకీర్తన 870మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 38శాతం, సెకండ్ ఇయర్‌లో 59శాతం విద్యార్థులు ఫలితాలు సాధించారని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల హవా

మెండోర: ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పోచంపాడ్ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు హవా కొనసాగించారని ప్రిన్సిపాల్ తారాసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో వర్షిత్ 978, బైపీసీలో గణేష్ 889మార్కులు సాధించగా, మొదటి సంవత్సరం ఎంపీసీలో సాయి కుమార్ 465, బైపీసీలో అమర్‌సింగ్ 432 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 75శాతం, సెకండ్ ఇయర్‌లో 93.3శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయబృందం అభినందనలు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

● పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవీపేట, ఏప్రిల్ 24: మండలంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత మూడురోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా చివరిరోజైన బుధవారం యజ్ఞం, పూర్ణాహుతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఉత్సవాలకు పలు గ్రామల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లింగమయ్య గుట్ట శివాలయం ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీ సిద్దేశ్వర మహరాజ్, శ్రీనివాస్ గౌడ్, కోటిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శాఖవార్ రమేష్, దేవేందర్, మూర రెడ్డి, రాజరెడ్డి, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

● సౌకర్యాలు కల్పించాలని వినతి

మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో పలు సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని కోరారు. ఆలయ ప్రాంగణంలో బోరుమోటారుతో పాటు నూతన ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అలాగే ఆలయానికి వెళ్లేదారిలో సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

● ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి: మాజీ మేయర్ సంజయ్



మాట్లాడుతున్న సంజయ్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్24: గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయా ంలో అంతా అవినీతి పాలన సాగిందని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప జరిగిన అభివృద్ధి శూన్యమని నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ అ న్నారు. నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వల్లే ప్రజాసంక్షేమం సాధ్యమని అన్నా రు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్యారంటీ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా ఉన్న సీనియర్ నాయకు డు జీవన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. భగవంతుడు పేరు చెప్పి బీజేపీ రాజకీయాలు చేస్తోందని అన్నారు. పసుపుబోర్డు పేరు తో గెలిచి ఇప్పటికీ పసుపుబోర్డుపైనే ఓట్లు అడుగుతున్న అర్వింద్‌కు ఎం దుకు ఓటు వేయాలో జవాబు చెప్పాలన్నారు. పాత కలెక్టరేట్‌ను, కలెక్టరే ట్ మైదానాన్ని కబ్జాచేయాలని బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారని, నగరం లో బడా రాంమందిర్, నీలకంఠేశ్వర్ ఆలయాల భూములు అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. వీటిపై బీజేపీ నేతలు విచారణ జరిపించాలన్నారు.

బీజేపీలో చేరిన పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



కోటపాటికి కండువా వేసి ఆహ్వానిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్24: పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటపాటి నర్సింహంనాయుడు బుధవారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ సమక్షం లో కోటపాటి నర్సింహంనాయుడు బీజేపీలో చేరగా బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో పసుపుబోర్డు మంజూరైందని, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామాచేసి తాను బీజేపీలో చేరినట్లు తెలిపారు. తమతోపాటు గల్ఫ్‌కార్మికులు, రైతు నాయకులు బీజేపీలో చేరారన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలిపేలక్ష్యంగా పని చేస్తామని, నరేంద్రమోదీని ప్రధానిగా మూడోసారి చూడాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, ఇందల్వాయి కిషన్, నవీన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలి'

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్24: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందం దివాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన పార్లమెంట్‌స్థాయి ఓబీసీమోర్చా సామాజిక సమ్మేళనంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేస్తూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు యామాద్రిబాస్కర్, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఎడపల్లి, ఏప్రిల్ 24: మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన చాకలి భూమవ్వ (65) గ్రామంలోని చెరువులో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. భూమవ్వ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని, ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుమారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా అస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వర్నిలో కుస్తీపోటీలు

వర్ని,ఏప్రిల్24: హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా పాత వర్నిలో బుధవారం కుస్తీపోటీలు, జాతర కోలాహలంగా జరిగాయి. ఆఖరు కుస్తీలో భాగంగా సుద్దులంకు చెందిన కుస్తీ వీరున్ని పాత వర్నికి చెందిన పెద్ద పుల్ల శ్రీనివాస్ పడేశాడు. దీంతో జంగం రాచప్పకు 10తులాల వెండి కడియాన్ని అందజేశారు. ఆఖరుకుస్తీకి గ్రామ కమిటీ రూ.వెయ్యి అదనంగా అందజేశారు. కార్యక్రమంలో సబ్సిడీ నర్సింలు, అర్జున్, పెరిక సాయిలు, నారాగౌడ్, సురేష్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



కడియాన్ని బహూకరిస్తున్న దృశ్యం

నేటి నుంచి భేతాళస్వామి జాతర

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 24: బాన్సువాడ పట్టణంలో ప్రతీ యేటా నిర్వహించే భేతాళస్వామి జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. జాతర కోసం నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జాతర మొదటిరోజు ఎడ్లబండ్ల ప్రదర్శన, రెండవ రోజు కుస్తీ పోటీలు, మూడవ రోజు జాతర ముగింపు ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ జాతరకు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

..ఓపెన్ స్కూల్ పరీక్షలు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 24: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహించడం జరుగుతుందని డీఈవో రాజు తెలిపారు. పరీక్షవేళలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరగనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి చుట్టు పక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులోకి ఉన్నందున జనం సమూహాలుగా గుమిగుడి ఉండడం నిషేధం. ఆయా పరీక్షా తేదీల్లో పరిసరాల్లో జిరాక్స్ సెంటర్‌లు మూసి వేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 సెంటర్‌లు కేటాయించగా 1432 ఇంటర్మీడియట్, 927 పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

రైతుల ఖాతాల్లో రూ.70కోట్లు జమ చేశాం

● జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 24: కామారెడ్డి జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలకు గాను 264 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 14331 మంది రైతుల నుంచి 89,244 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు తెలిపారు. కామారెడ్డి మండలం గర్గుల్, రామారెడ్డి మండలం అన్నారం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 196.61 కోట్ల విలువైన ధాన్యాన్ని ఇప్పటి వరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకు 70కోట్లు జమ చేశామని తెలిపారు. రైతులకు డబ్బులు సకాలంలో అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి, కృష్ణాజీవాడిలలో రెండు రోజులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

లింగంపేట, ఏప్రిల్ 24: మండల కేంద్రంలోని పాత చెక్కెర ఫ్యాక్టరీ రోడ్డులో గల చల్ల మల్లయ్య పొలం పక్కన బుధవారం 11కేవీ విద్యుత్ తీగ తెగి పడి విద్యుదాఘాతంతో మండల కేంద్రంలోని ఇస్లావత్ గోవింద్‌కు చెందిన మేక మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. అట్టి మేక రూ.10వేల విలువ గలదని ఆయన తెలియజేశాడు. ట్రాన్స్‌కో అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వీరానందరావు

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

తాడ్వాయి, ఏప్రిల్ 24: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మండల ప్రత్యేకాధికారి వీరానందరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు సకాలంలో బ్యాంకు నుంచి, గ్రూపుల నుంచి రుణాలు తీసుకుని చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించాలని తెలిపారు. చిన్నచిన్న వ్యాపారులతో ఆర్థికంగా నిలబడవచ్చని ఆయన వివరించారు. ఆదర్శ పాఠశాల కమిటీ తక్షణం వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీపీఎం రవీందర్ మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో వాయిదాల ప్రకారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం ప్రత్యేకంగా శ్రీనిధి రుణాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాజిద్‌అలీ, తహసీల్దార్ రహిముద్దిన్, డీపీఎం వకుల, ఏపీఎం రవీందర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోద, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందిపై అధికారుల ఆగ్రహం



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వామన్‌రావు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 24: మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో ఏపీడీ వామన్‌రావ్ పరిశీలించారు. పెద్ద కొడప్‌గల్ గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న పనులను పరిశీలించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీరోజు కూలీలు పనికి రాగానే సంబంధిత కూలీల పేర్లు మస్టర్‌లో నమోదు చేయాల్సి ఉండగా, వారం రోజుల నుంచి మస్టర్‌లో హాజరు వేయకుండా కాలి మస్టర్ లభించడంతో ఎఫ్‌ఏపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల హాజరు ఒకేసారి వేస్తే ఎలా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటుగానే కూలీలు కొలతల ప్రకారం చేస్తున్నారా అని ఆరా తీయగా 10 మంది చేసే పని 100 కూలీలతో ఎలా చేయిస్తున్నారంటూ సంబంధిత అధికారులను ప్రశ్నించారు. పనులు చేసే విధానంపై కూలీలకు అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటుగానే నర్సరీల నిర్వహణ కూడా సరిగ్గా లేకపోవడంపై సిబ్బంది పనితీరు ఇలాగే ఉంటుందా అని ప్రశ్నించారు. తాను జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో ఉపాధి పనులను తనిఖీ చేస్తే ఈ మండలం ఉన్నంత అధ్వాన్నంగా మరే మండలం లేదని తెలిపారు. ఉపాధి పనులు చేయిస్తున్న ఏపీవో, టీఏలు, ఎఫ్‌ఏల పనితీరు బాగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనిఖీ విజిలెన్స్ అధికారి దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామారెడ్డిలో రథోత్సవాలు

రామారెడ్డి, ఏప్రిల్ 24: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సీతారామచందరస్వామి, రాజరాజేశ్వరస్వామి రథోత్సవాలు వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో హోమం, బలిహరణం, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ కొండ విజయ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రంగు రవీందర్‌గౌడ్, ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, జడ్పీటీసీ నారెడ్డిమోహన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీవి మోసపూరిత హామీలు

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

మచారెడ్డి, ఏప్రిల్ 24: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన హామీలను 100రోజులలో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికి ఇప్పటికి హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ హామీలు 100రోజుల్లో అమలు చేస్తే నా ఓటు కూడా కాంగ్రెస్‌కే వేస్తానని మాజీ స్పీకర్ బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం అన్నారు. బుధవారం మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ చౌరస్తాలోని శివబాలజీ ఫంక్షన్ హాలు నుంచి ఘన్‌పూర్ చౌరాస్తా వరకు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, మాఫీ అయినట్లయితే రుణమాఫీ అయిన రైతులు అందరు కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, రుణమాఫీ కాని రైతులు బీఆర్ఎస్‌కు ఓటువేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలలో ఎన్నో సంక్షేమపథకాలను అమలు చేసి దేశంలోనే అభివృద్ధి పథంలో నడిపించిందన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ఏ గ్రామంలోను అభివృద్ది పనులు చేపట్ట లేదని అటువంటి వ్యక్తికి ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌శెట్కార్‌ను ఓడించాలన్నారు.

కర్రుకాల్చి వాతపెట్టాలి..

ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఖర్రుకాల్చి వాతపెట్టాలని బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. గతంలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి అభివృద్ధి చేయలేని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తిరిగి ఏం మోఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని అన్నారు. జుక్కల్ నుంచి బాన్సువాడ, జోగిపేటమీదుగా రైల్వేలైన్ కేంద్రంతో పోట్లాడి వేయిస్తానని అన్నారు. నిరుద్యోగులకు స్కిల్స్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు వచ్చేవిధంగా కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ చేసిన అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని బీఆర్ఎస్‌కు ఓటువేసి గాలి అనిల్‌కుమార్‌ను పర్లమెంట్‌కు పంపాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్సింగ్‌రావు, జెడ్పీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌చంద్రం, వివిధ గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

పార్టీకి కార్యకర్తలే బలం : ఎమ్మెల్యే

రాజంపేట, ఏప్రిల్ 24: పార్టీకి కార్యకర్తలే బలమని కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలోని రెడ్డిఫంక్షన్‌హాల్‌లో తాడ్వాయి, రాజంపేట మండలాల బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజలతో ఉండి ప్రజాసమస్యలు తెలుసుకునిప్రజాసేవ చేస్తు ఉండాలని అప్పుడే ఎన్నికల సమయంలో ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. పార్టీ కోసం కార్యకర్త పనిచేస్తే కార్యకర్త కోసం పార్టీ ఉంటుందని తెలిపారు. మండల స్థాయినాయకులు ప్రతి గ్రామంలో కార్యకర్తలతో సమయపాలన పాటిస్తు బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా కృషిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీమంత్రి నేరెళ్ల ఆంజనేయులు,ఓబీసీ మోర్చా రాష్ట్ర సెక్రటరీ అజయ్‌కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాణాల లక్ష్మారెడ్డి,పైలాకృష్ణారెడ్డి, మర్రిరాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, జనరల్ సెక్రటరీ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడు సర్వ ప్రాణులను కాపాడుతాడు

● రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి



భక్తులతో మాట్లాడుతున్న మాధవానంద సరస్వతి

లింగంపేట, ఏప్రిల్ 24 : భగవంతుడు సర్వ ప్రాణులను సమానంగా కాపాడుతాడని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండలంలోని పొల్కంపేటలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని అమ్మవారి యంత్ర ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో మాట్లాడారు. ప్రతీ ఒక్కరిలోను భగవంతుడు ఉన్నాడని ఒకరిని ఒకరు గౌరవించుకోవాలని, కష్ట, సుఖాలలో పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపదలో ఉన్నవాని ఆదుకోవాలని ఆయన తెలియజేశారు. దుష్టులను సంహరించడానికి అమ్మవారు మహంకాళిగా మారుతుందని ఆయన తెలిపారు. అమ్మవారి ఆలయం చుట్టు 12ప్రదక్షణలు చేయాలని అమ్మవారు సర్వ లోకాలను కాపాడుతుందని ఆయన తెలియజేశారు. భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదపండితుడు రాజశేఖర శర్మతో పాటు భక్తులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పైడి రాజశేఖర్

భిక్కనూరు, ఏప్రిల్ 24: బీజేవైఎం కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార రాజశేఖర్‌కు నియామకపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకముంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన జిల్లా అధ్యక్షురాలు, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి పూర్తి సమయాన్ని కేటాయిస్తూ అహర్నిశలు కష్టపడతానన్నారు. కాగా రాజశేఖర్‌రెడ్డి బీజేవైఎం భిక్కనూరు మండల అధ్యక్షుడిగా కొనసాగాడు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప, కామరాతి విగ్రహ ప్రతిష్ఠాపన

భిక్కనూరు, ఏప్రిల్ 24: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం ఉదయం భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రధానవీధుల గుండా బీరప్ప, కామరాతి, తదితర విగ్రహాలను డోలుచప్పుళ్లు, డోలు వీరుల విన్యాసాల నడుమ ఊరేగించి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రాంగణంలో హోమ కార్యక్రమాలు, అభిషేకాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ప్రతినిధులు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

భిక్కనూరు, ఏప్రిల్ 24: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న జీర్ణోద్ధరణ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో బాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మూలమూర్తుల శేషహోమము, ధ్వజస్థంబ ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ, ఆంజనేయ గరుడ విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ముత్యాల పందిరిని ఏర్పాటు చేసి తీరొక్కపూలతో అందంగా అలంకరించి శ్రీ స్వామివారి కళ్యాణాన్ని వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకోగా ఆలయ ప్రాంగణంలో భిక్కనూరుకు చెందిన గజవాడ నాగరాజు-సునంద దంపతులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి కళ్యాణం, ధ్వజస్థంబ ప్రతిష్ఠ కార్యక్రమాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



తిప్పాపూర్‌లో వేంకటేశ్వర కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 24: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పెద్ద కొడప్‌గల్ విద్యార్థినిలు ప్రతిభ చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 79 మంది విద్యార్థినిలు హాజరు కాగా 47 మంది ఉత్తీర్ణులు, 32 మంది అనుత్తీర్ణులు అయ్యారు. ఇక ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు 71 మంది హాజరు కాగా 51 ఉత్తీర్ణులు, 20 మంది విద్యార్థినిలు అనుత్తీర్ణులు అయ్యారు. మొదటి సంవత్సరం ఎంపిసి విభాగంలో ఎస్. అంజలి 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించింది. దీంతో పాటుగానే ఇంటర్ రెండవ సంవత్సరం బైపిసి విభాగంలో బి. సంజన 1000 మార్కులకు గాను 947 మార్కులు సాధించింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిలకు పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు నళినితో పాటు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.



అంజలి



వలకొండ చర్విత

ఆదర్శ పాఠశాల, కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 73 శాతం ఉత్తీర్ణత

నిజాంసాగర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో విద్యాభ్యాసం చేసి వార్షిక పరీక్షల్లో 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో నందినికి 940, సరస్వతికి 929, బైపీసీలో అక్షయకు 972, సంతోషికి 947, సీఈసీలో అశ్విని 838, వైష్ణవికి 798 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 102 మంది విద్యాభ్యాసం చేశారు. ప్రథమ సంవత్సరంలో 102 మంది బాల, బాలికలు విద్యాభ్యాసం చేసి పరీక్షలు రాయగా, 48 శాతం ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. ప్రథమ సంవత్సరంలో టాపర్లుగా సిహెచ్ పూజిత 445, సరస్వతి 399, హారిక 381, శ్రీ లేఖ 368, అంకిత 371, సాయి కుమార్ 337 మార్కులు సాధించి ప్రథమ సంవత్సరంలో టాపర్లుగా నిలిచారు.

ఇంటర్ ఫలితాల్లో టాపర్‌గా వలకొండ చర్విత

భిక్కనూరు: ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినీ వలకొండ చర్విత రాష్ట్ర టాపర్‌గా నిలిచింది. హైదరాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న చర్విత ఎంపీసీ విభాగంలో 470మార్కులకు గానూ 468మార్కులు సాధించి ఎంపీసీ విభాగంలో రాష్ట్ర టాపర్‌గా నిలిచింది. చర్విత అంతంపల్లి విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి కూతరు. కాగా రాష్ట్ర టాపర్‌గా నిలిచిన చర్వితకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

చాముండేశ్వరీ ఆలయంలో పూజలు

దోమకొండ, ఏప్రిల్ 24:మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాముండేశ్వరీ దేవి రాజగోపుర శిఖర స్థిన యంత్ర ప్రతిష్ఠ, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తెలిపారు. 28వరకు ఆలయంలో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఆలయం ఆవరణలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

మద్నూర్, ఏప్రిల్ 24: మండలంలో 3 ఇసుక ట్రాక్టర్లు, ఒక బోలెరో వాహనాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంతం ఖత్‌గాం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తుండగా, పట్టుకుని ఆరుగురు వ్యక్తులతో పాటు మహారాష్ట్రకు చెందిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మాచారెడ్డి: పాల్వంచ గ్రామంలోని వాగులోంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

ఇంటర్‌లో కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

దోమకొండ, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ మమత బుధవారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 50శాతం, రెండవ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో టి.అఖిల, వి. లావణ్య, బైపీసీలో ఎం. దేవలక్ష్మీ, పి. పూజ, మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎం. శ్రావ్య, ఎం. అఖిల, బైపీసీఎం. రసజ్ఞ, ఎస్. రజనీలు ప్రతిభ సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మనజుమిల్ బాయ్స్
శాంతి - టిల్లు స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి - టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర - పారిజాత పర్వం

చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210